క్లుప్తంగా

రామనారాయణంలో ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనారాయణంలో వినాయక చతుర్థి నవరాత్రులను పురస్కరించుకుని స్వామివారికి ఆదివారం పంచామృత స్నపన పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో గట్టును చదును చేయిస్తున్న అధికారులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని గెడ్డ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. సర్వే నంబర్ 42లో గెడ్డ ఆక్రమణకు గురికావడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనూష, వీఆర్ఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సీఐ రామకృష్ణ, ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది

డెంకాడ: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భోగాపురం సీఐ రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎస్‌ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈపీడీసీఎల్ ఎస్‌ఈ మువ్వల లక్ష్మణరావు అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక ఈపీడీసీఎల్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంజినీర్ తన కెరీర్‌లో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఈలు పూడి హరి, జి.సురేష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీధర్ ఆచార్య, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: నవజీవన్ ట్రస్ట్ ఫౌండర్ డీకే శ్రీధర్ ఆచార్య ఆధ్వర్యంలో అన్నలక్ష్మి ఫ్రీ రేషన్ డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా 35 మంది వితంతువులకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. కణపాకలోని సాయిబాబా కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మసేవా సంస్థ ప్రతినిధి పురుషోత్తం, ఎస్వీ రమణ, డి. శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి 108 రకాల పిండి వంటలతో నివేదన



వినాయకుడికి సమర్పించిన 108 రకాల పిండివంటలు

విజయనగరం టౌన్: పట్టణంలోని రంగాలవీధిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో స్వామివారికి ఆదివారం 108 రకాల పిండివంటలతో నివేదన సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా 'స్వచ్ఛతా హి సేవా'

- 15 రోజుల పాటు స్వచ్ఛత కార్యక్రమాలు
- రేపు అయ్యకోనేరు వద్ద ప్రారంభించనున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమాలు



విజయగనరం సిటీ

విజయనగరం: స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూపొందించి అమలు చేస్తున్న స్వచ్ఛతా హీ సేవ - 2024 కార్యక్రమాన్ని 15 రోజులు పాటు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీ నుంచి చేపట్టనున్న రోజువారీ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 17వ తేదీ ఉదయం 7.30 గంటలకు అయ్యకోనేరు వద్ద రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే, నగర మేయర్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 గంటలకు సీఎంఆర్ జంక్షన్ నుంచి ఎంఆర్ కాలేజ్ వరకు స్వచ్ఛతా వాక్ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు కొత్తపేట రాజీవ్‌నగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ కార్యక్రమం చేపడతారు. మధ్యాహ్నం మూడు గంటలకు అయ్యన్నపేట, కామాక్షినగర్ ప్రాంతాలలో దోమల వృద్ధి కేంద్రాల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టనున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. 30వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను ఆయన వెల్లడించారు.

కార్యక్రమాల వివరాలు..

19వ తేదీ: ఉదయం 8.30 గంటలకు బాబామెట్ట గరల్స్ పాఠశాల, కస్పా హైస్కూల్‌లలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలు.
- మధ్యాహ్నం 3 గంటలకు వై జంక్షన్ వద్ద సంపూర్ణ శ్రమదానం.

20వ తేదీ: ఉదయం 8.30 గంటలకు జమ్ము మున్సిపల్ పార్కు వద్ద 'ఏక్ పేడ్ మా కి నామ్' నినాదంతో మొక్కలు నాటుట.
- మధ్యాహ్నం 3 గంటలకు బొంకులదిబ్బ వద్ద సంపూర్ణ శ్రమదానం.

21వ తేదీ: ఉదయం 8 గంటలకు అంబటి సత్రం నుంచి రాక్‌గార్డెన్ వరకు పార్కులలో పరిశుభ్రత కార్యక్రమం.
- మధ్యాహ్నం మూడు గంటలకు పాలాస్పత్రి వద్ద ప్రజారోగ్య సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేయడం.

22వ తేదీ: ఉదయం 7 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాలువల పరిశుభ్రత.

23వ తేదీ: ఉదయం 7.30 గంటలకు ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం.
- 10:30 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు.
- మధ్యాహ్నం 3 గంటలకు బాలాజీ జంక్షన్ నుంచి దాసన్నపేట వరకు రహదారుల పరిశుభ్రత.

24వ తేదీ: తాగునీటి నిర్వహణ శుభ్రత కార్యక్రమాలు. నీటి నమూనా పరీక్షలు, క్లోరినేషన్ కార్యక్రమాలు.
- 10.30 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో పారిశుధ్య కార్మికులకు సన్మానాలు.

25వ తేదీ: ఉదయం 7.30 గంటలకు మున్సిపల్ కాంప్లెక్స్ ప్రాంతంలో గణేష్ కోవెల వద్ద కార్మికులచే పరిశుభ్రత కార్యక్రమాలు.
- 10:30 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో పారిశుధ్య కార్మికులు,కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు.

26వ తేదీ: మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టర్ ఆఫీస్, ఆర్అండ్‌బీ జంక్షన్ వరకు సంపూర్ణ శ్రమదాన కార్యక్రమాలు.

27వ తేదీ: నగరంలోని అన్ని డివిజన్లో వార్డు సభలు నిర్వహించుట. ఎన్‌సీఎస్ థియేటర్ వద్ద నున్న గాంధీ విగ్రహం వద్ద సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు.

28వ తేదీ: కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి మూడులాంతర్ల వరకు రహదారుల పరిశుభ్రత.

29వ తేదీ: గుణుపూర్‌పేట డంపింగ్ యార్డ్ వద్ద వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిశుభ్రత అవగాహన కార్యక్రమాలు.

30వ తేదీ: ఉదయం 9 గంటలకి బాబామెట్ట, బ్యాంక్ కాలనీలల్లో చెత్త వర్గీకరణ, రీసైక్లింగ్ నైపుణ్యతపై అవగాహన కార్యక్రమాలు.

అనధికార వ్యక్తులకు అద్దె చెల్లించవద్దు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



పి.నల్లనయ్య, కమిషనర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలాల్లో బడ్డీలు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారస్తులు ఇతర వ్యక్తులకు అద్దెలు చెల్లించవద్దని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటివరకు విజయనగరం కార్పొరేషన్ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల నుంచి తాత్కాలిక ఆక్రమణ ఫీజులను విజయనగరం కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తారని, అయితే కార్పొరేషన్ స్థలాలు ఆక్రమించి కొత్తగా వ్యాపారాలు చేస్తే మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఆస్తులను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యను సృష్టించవద్దన్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై బడ్డీలు ఏర్పాటు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. మూడు లాంతర్ల జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు కొంతమంది దుకాణదారులు తమ ముందున్న స్థలం వేరేవారికి అద్దెకు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న జేవీవీ, గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు

- జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆనంద్

విజయనగరం ఫోర్ట్: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తినడానికి తిండి, తాగడానికి నీరు లేక మూడు వారాలుగా విజయవాడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవీఆర్ కృష్ణాజీ, రాష్ట్ర నాయకుడు లక్ష్మణరావు, జాతీయ విద్యావిభాగం కన్వీనర్ రాజశేఖర్, గండ్రేటి శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక పరిష్కారాలు కనుగొనాలి



ఎక్స్‌పోను తిలకిస్తున్న హిందూస్తాన్ షిప్‌యార్డు మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు



పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ముఖ్య అతిథి శ్రీనివాసరావు, తదితరులు

- విశాఖ హిందూస్తాన్ షిప్‌యార్డు మేనేజర్ శ్రీనివాసరావు

డెంకాడ: ఇంజినీరింగ్ విద్యార్థులు సమస్యలకు వినూత్నంగా ప్రయోగాత్మక పరిష్కాలు కనుగొన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని విశాఖ హిందూస్తాన్ షిప్‌యార్డు(నాణ్యత, భద్రత) మేనేజర్ డి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ఇంజినీర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్‌లను తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు వినూత్నంగా ఉండాలన్నారు. హిందూస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ఇంజినీరింగ్ డిజైన్, రక్షణ రంగం, చమురు వ్యాపార సంస్థలకు నౌకల తయారీలో సేవలు అందిస్తోందన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేలా ఓడలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూస్తాన్ షిప్‌యార్డు టెక్నికల్ సపోర్ట్ ఎస్వీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు, కో ఆర్డినేటర్ బి.శ్రీధర్, విభాగాధిపతులు ఎ.రామరావు, ఎం.రాజన్‌బాబు, ఆర్.రాజేంద్ర, కె.సుబ్బరామయ్య, సతీష్ పూజారి, పి.దుర్గాశైలజ, సతీష్, వి.వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మోక్షగుండం' సేవలు ఎనలేనివి..



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జ్ ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి , తదితరులు

విజయనగరం టౌన్: భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశానికి అందించిన సేవలు ఎనలేనివని జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జ్ ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి అన్నారు. కళాశాల ఆవరణలో ఆదివారం ఇంజినీరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు దేశానికి మూల స్తంభాలని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. ప్రతి విద్యార్థీ నైతిక విలువలు పాటిస్తూ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మోక్షగుండంను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇంజినీర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా ముఖ్యమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, సివిల్ ఇంజినీరింగ్ ఇన్‌చార్జ్ విభాగాధిపతి డాక్టర్ జి. అప్పలనాయుడు, డాక్టర్ ఆర్.గురునాథ్, డాక్టర్ సి.నీలిమాదేవి, కె.శ్రీనివాసప్రసాద్, బిందుమాధురి, హరిప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు..

- నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న బాధితులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



దుప్పాడలో కూలిన ఇల్లు



జొన్నవలసలో కూలిన ఇల్లు

విజయనగరం రూరల్: ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు పేదల ఇళ్లు కూలిపోయాయి. ఇంట్లో ఉన్న వంటసామగ్రితో పాటు దుస్తులు, తిండిగింజలు, ఇతర సామాన్లు నేలమట్టం కావడంతో బాధితులు నిలువనీడ లేక లబోదిబోమంటున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులపై ప్రకృతి పగబట్టింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. కనీసం ఏం తింటున్నామో, ఎలా ఉంటున్నామో కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దుప్పాడ గ్రామ పరిధి యాతపేటకు చెందిన బాడితబోయిన రమణమ్మ దినసరి కూలి. ఇటీవల కురిసిన వర్షాలకు తన ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం పాడవ్వడంతో కట్టుబట్టలతో మిగిలిపోయింది. ఇద్దరు ఆడపిల్లలతో ఆరుబయట ఉంటూ కాలం వెళ్లదీస్తోంది. అలాగే జొన్నవలస గ్రామానికి చెందిన కిలారి శంకర్, కోరావ నరసయ్యమ్మకు చెందిన ఇళ్లు కూడా కూలిపోయాయి. కోరుకొండ గ్రామానికి చెందిన జోగ అప్పయ్యమ్మకు చెందిన పెంకుటిళ్లు పైకప్పు ఒక్కసారిగా కూలిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రభుత్వం నుంచి కనీస సహాయం అందకపోవడంతో లబోదిబోమంటున్నారు.

భరోసా ఏదీ?



ఇల్లు కూలి ఐదు రోజులైంది. ఇంట్లోనే వంట సామగ్రి, బట్టలు, నగదు ఉండిపోయాయి. కట్టుకునేందుకు కూడా దుస్తులు లేక నానా అవస్థలు పడుతున్నాను. ఇద్దరు ఆడపిల్లతో ఉన్నాను. ప్రభుత్వం నుంచి అధికారులు గాని, పాలకులు గాని ఎటువంటి భరోసా ఇవ్వలేదు. కనీసం పట్టించుకోలేదు.

– బాడితబోయిన రమణమ్మ, దుప్పాడ గ్రామం

పరిహారం అందజేస్తాం



మండలంలో దుప్పాడ, జొన్నవలస, కోరుకొండ గ్రామాలలో నాలుగు ఇళ్లు వర్షాలకు కూలిపోయాయి. వివరాలు సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు రాగానే పరిహారం అందజేస్తాం.

– కూర్మనాథ్, తహసీల్దార్, విజయగనరం మండలం

జూనియర్ లైన్‌మన్లు లేక ఇబ్బందులు

విజయనగరం రూరల్:

మండలంలోని ద్వారపూడి, గుంకలాం గ్రామ సచివాలయాల్లో జూనియర్ లైన్‌మన్లు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సమస్యలు నెలకొన్నప్పుడు ఎవరిని సంప్రదించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి లైన్‌మన్లను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవగాహన పెరగడం అభినందనీయం

విజయనగరం ఫోర్ట్: నేత్రదానంపై అవగాహన పెరగడం అభినందనీయమని రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల్లో ఐదుగురి కార్నియాల సేకరించామని పేర్కొన్నారు. నేత్రదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కమ్మవీధిలో వరసిద్ధి వినాయక మహోత్సవాల సందర్భంగా కమిటీ సభ్యులు 45 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఆదివారం పంపిణీ చేశారు. అంతకు ముందు సరస్వతీదేవీ కటాక్షం కోసం విద్యా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

పూసపాటిరేగ: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో పీఆర్‌టీయూ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, పీఆర్‌టీయూ బలోపేతం, సభ్యత్వ నమోదుపై చర్చించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్టా కృష్ణయ్య, గిరి ప్రసాదరెడ్డి, వైష్ణవ కరుణానిధిమూర్తి, ఎ. రాజ్‌కుమార్, బి. పాపినాయుడు, వలిరెడ్డి రవీంద్రనాయుడు, డి. శ్రీనివాసరావు, జి. గణపతి, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు...

తొమ్మిది రోజల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, యువత నృత్యాల నడుమ ఆదివారం ఊరేగించారు. ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తూ చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



జొన్నగుడ్డి ప్రాంతంలో ఊరేగుతున్న వినాయకుడు



నిమజ్జనానికి తీసుకెళ్తున వినాయక విగ్రహం



సందడి చేస్తున్న బిందెల డ్యాన్స్ కళాకారులు



నృత్యం చేస్తున్న యువత



అంబటిసత్రం రోడ్డులో మహిళల కోలాటం

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట 18వ వార్డు శాంతినగర్ వీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, నల్లి కృష్ణవేణి, గ్రామపెద్దలు బుగత రాము, రాజశేఖర్, వెంకటి, పల్ల రాము, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.